నేటి కందం- నేటికి అందం

భవితను గావగ-ప్రజలకు-
ప్రవచించగ వలయు రోగ లక్షణ చయమున్
వివరమ్ములతో బాటుగ
నవగాహనకై ప్రపంచ యైడ్సు దినమునన్ !!

(డిసెంబరు 1 ప్రపంచ ఎయిడ్స్ దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

చుట్టూర సమస్యల
సంక్షోభపు నెగళ్లే
బయటపడక నిత్యం
బతుకులన్ని కన్నీళ్లే
ప్రభుత్వం ఏదొచ్చిన
పరిష్కార లక్ష్యం
పాక్షికమే ఇప్పటికీ
పేదరికమే సాక్ష్యం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 1-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:91 పేజీలు:6 వెల: రూ.1/-


## ఫెంగల్ తుఫాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి, నవంబర్ 30:బంగాళఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ఈ సాయంత్రం తీరం దాటనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబువిపత్త నిర్వహణ శాఖ, జిల్లా కలెక్టర్లు, సీఎంఓ, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో నేడు సమీక్ష నిర్వహించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారలను కోరారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు రియల్ టైంలో అంచనా వేసి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్టీజీ ద్వారా నిరంతర పర్యవేక్షణతో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్లను కోరారు.

అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు..

తుఫాన్ కారణంగా ఆకస్మిక వరదలు వస్తాయనే సమాచారం నేపథ్యంలో ఆయా జిల్లాల అధికారులు డిజాస్టర్ టీంను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు సీఎం. ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు ముందునుంచే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలకు సమాయాత్తం కావాలని జిల్లా కలెక్టర్లను కోరారు సీఎం . తుఫాన్ పై కళ్లాలలో ధాన్యం ఆరబోసిన రైతులు తుపాన్ కారణంగా ఆందోళన చేందుతున్నారని అంటూ, వర్ష, వరద నిర్దిష్టమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరవేయాలన్న అన్నిజిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## తెలంగాణ పబ్లిక్ కమిషన్ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం నియామకం



హైదరాబాద్, నవంబర్ 30:తెలంగాణ పబ్లిక్ కమిషన్ ఛైర్మన్ గా బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కమిషన్ లో కొత్త సభ్యులను నియమించగా, తాజాగా ఛైర్మన్ కూడా నియమించింది.

కాగా, ప్రస్తుతం టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా ఎం మహేందర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం డిసెంబర్ 3న ముగియనుంది. దీంతో కొత్త ఛైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 45 అప్లికేషన్లు రాగా అందులో రిటైర్డ్ ఐఏఎస్‌లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫసర్లు కూడా ఉన్నారు. వారిలో బుర్రా వెంకటేశంను ఎంపిక చేసిన ప్రభుత్వం.. నియామక ఆమోదం కోసం ఫైలును రాజ్‌భవన్‌కు పంపించింది. దీంతో శనివారం ఉదయం ఆ ఫైలుపై గవర్నర్ సంతకం చేశారు. దీంతో మరో నాలుగేండ్ల సర్వీస్ ఉన్నప్పటికీ.. ముందుగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. డిసెంబర్ 2న టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

## రేవంత్‌తో ఆస్ట్రియా, తుర్కియే రాయబారుల భేటి..

హైదరాబాద్, నవంబర్ 30: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నేడు ఆస్ట్రియా, టర్కీ రాయబారులు మర్యాద పూర్వకంగా కలిశారు.. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకు వచ్చిన ఆస్ట్రియా రాయభారి కేధరినా వెజర్ అక్కడే ఉన్న ముఖ్యమంత్రితో భేటి అయ్యారు.. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ చేపడుతున్న పలు పథకాలు, అమలు చేసున్న సంక్షమ కార్యక్రమాలను రేవంత్ ఆమెకు వివరించారు. అలాగే భవిష్యత్ ప్రణాళిలను ముఖ్యమంత్రి పేర్కొన్నారు.అలాగే హైదరాబాద్ లో



పర్యటిస్తున్న తుర్కియే దేశ రాయబారి ఫిరాట్ సునెల్ కూడా రేవంత్ తో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తోన్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను తుర్కియే రాయబారి గారు ఆసక్తిగా తెలుసుకున్నారు.. హైదరాబాద్‌లోని తుర్కియే ఎంబసీ కాన్సులేట్ జనరల్ ఎల్మన్ ఓహన్ , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర , ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సిసిఐ పత్తి గోడౌన్ లో అగ్ని ప్రమాదం - కోట్ల విలువైన కాటన్ బూడిద

మేడ్చల్, నవంబర్ 30: మెడ్చల్ లోని సిసిఐ గోడౌన్ లో నేడు భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.. పత్తి కావడంతో క్షణాలలో మంటలు గిడ్డంగి అంతా వ్యాపించాయి.. చూస్తుండగానే కోట్ల విలువైన కాటన్ బూడిదైంది. మంటల ధాటికి గోడౌన్ భవనం కుప్పకూలింది. ప్రమాదవార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక . మంటలు చెలరేగిన వెంటనే గమనించిన కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనావేస్తున్నారు.

## పోటీ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమతుల్యత పాటించాలి : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. కేంద్ర సంస్థల అధికారులు రాష్ట్ర పోలీసులచే దర్యాప్తు చేయబడిన, దర్యాప్తు చేస్తున్న కేసుల్లో పోటీ అంశాల మధ్య సమతున్యతను పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈడీ అధికారి అంకిత్ తివారీ లంచం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

సమాఖ్య నిర్మాణంలో, ప్రతి భాగం ప్రతి భాగం దాని గుర్తింపు, అధికార పరిధిని కలిగి ఉండేలా చూసుకోవాలని చెప్పింది. ఒక రాష్ట్రం ఏకపక్షంగా కేంద్ర

ప్రభుత్వ అధికారులను అరెస్టు చేయాలని నిర్ణయించుకుంటే.. అది రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుందని కోర్టు పేర్కొంది.

అలాంటి పరిస్థితిలో రాష్ట్రానికి ప్రత్యేక అరెస్టు అధికారం ఉందని చెబితే, అది సమాఖ్య నిర్మాణానికి ప్రమాదకరమని.. అయితే తమ పరిధిలోని కేసును దర్యాప్తు చేసే అధికారాన్ని రాష్ట్ర పోలీసులకు లేకుండా చేయడం సరికాదని కూడా ధర్మాసనం పేర్కొంది.

ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. ఈ పోటీ అంశాల మధ్య సమతుల్యతను సాధించేందుకు ఇరుపక్షాల వాదనలు పరిశీలిస్తామని చెప్పింది. విచారణలో నిందితుడు తన పక్షాన్ని ప్రదర్శించలేనప్పటికీ, న్యాయమైన దర్యాప్తునకు ఆయనకు హక్కు ఉందని పేర్కొంది.

కేసు విచారణను జనవరిలో విచారించనున్నట్లు తెలిపింది.

లంచం ఆరోపణలపై అంకిత్ తివారీకి సుప్రీం మార్చి 20న మధ్యంతర బెయిల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

అంకిత్ తివారీ కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

అంకిత్ తివారీని తమిళనాడు విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ డైరెక్టరేట్ లంచం ఆరోపణలపై అరెస్టు చేసింది. మధురైలోని ఈడీ సబ్ జోనల్ కార్యాలయంలో విధుల్లో ఉన్న అంకిత్ తివారీ 2023 డిసెంబర్ 1న తమిళనాడుకు చెందిన ప్రభుత్వ అధికారి నుంచి రూ.20లక్షలు లంచం తీసుకుంటుండగా అరెస్టు చేసినట్లు డీవీఏసీ పేర్కొంది.

ఆ తర్వాత ఈడీ తమిళనాడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది.

రాష్ట్ర విజిలెన్స్ అధికారులు మధురైలోని జోనల్ కార్యాలయంలోకి చొరబడి కేసు రికార్డులను దొంగిలించారని ఆరోపించారు. విచారణ సందర్భంగా తమిళనాడు తరఫు న్యాయవాది వాదిస్తూ లంచం తీసుకుంటుండగా తివారీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని, కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందని వాదనలు వినిపించారు. ఈడీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నందున పోలీసులు ఇంకా ఛార్జిషీట్ దాఖలు చేయలేదన్నారు.

## నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలి

### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తుల వినతి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రాపర్తి రవి కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గ్రామస్తులు విన్నవించారు.

రాపర్తి రవి కిడ్నీ సంబంధిత వ్యాధితో ప్రాణాలు కోల్పోయాడు. కుట్టు మిషన్లు రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రవి మృతి చెందడంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయింది. మృతుడు రవి అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు చందాలు సమీకరించి అంత్యక్రియలు నిర్వహించారు.

రవి మరణంతో కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాన్ని స్థానిక శాసనసభ్యులు అది శ్రీనివాస్ ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఫెంగల్ ఎఫెక్ట్.. చెన్నై ఎయిర్‌పోర్ట్ మూసివేత.. ప్రయాణికుల ఇబ్బందులు

హైదరాబాద్, నవంబర్ 30:నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైవున్న వాయుగుండం శుక్రవారం తుఫానుగా మారింది. ఇది శనివారం సాయంత్రానికి పుదుచ్చేరి సమీపంలో కరైకల్ ? మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని చెన్నై(అష్ట్రవనినిజీతి) ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ తుఫాను ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఫంగల్ తుఫాను ప్రభావంతో రాజధాని చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు పూర్తిగా నీటమునిగాయి. బలమైన ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకూ విమానాశ్రయాన్ని (అష్ట్రవనినిజీతి ఒతితీజూనీతీబి) తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు (బివఎజూనీతీజీతీతిశ్రీఎ బష్ట్రబీబి) ప్రకటించారు. ఇప్పటికే ఇండిగో సహా పలు విమాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## దారుణం.. బస్‌లో యాసిడ్ దాడి.. ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలు

అమరావతి, నవంబర్ 30:: ఏపీలో మహిళలపై దాడులు కలవరానికి గురి చేస్తున్నాయి. విశాఖపటణంలో ఓ అగంతకుడు బస్సుపై యాసిడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో ముగ్గురు మహిళా ప్రయాణికులకు గాయాలు కాగా వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

విశాఖ కంచెరపాలెం ఐటీఐ జంక్షన్ వద్ద నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సుపై గుర్తు తెలియని వ్యక్తి బస్ ఎక్కి తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌తో మహిళలపై దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో ముగ్గురు మహిళా ప్రయాణికులపై పడిందని విశాఖ పోలీస్ కమిషనర్ తెలిపారు.

గాయపడ్డ మహిళలను ఊర్వశి జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడిని త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని తెలిపారు.

## తిరుచానూరులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. ముత్యపుపందిరిపై ఆదిలక్ష్మి ఊరేగింపు

తిరుపతి, నవంబర్ 30: తిరుచానూరు కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ఉదయం పద్మావతి అమ్మవారి ముత్యపుపందిరి వాహనంపై ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ముత్యాలు అలిమేలు మంగకు అత్యంత ప్రీతిపాత్రమైనవని వేద పండితులు తెలిపారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అలమేలుమంగను సేవించిన భక్తులకు తాపత్రయాలు తొలిగి, కైవల్యం చేకూరుతుందని విశ్వాసమని పేర్కొన్నారు.

మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుందని వెల్లడించారు. రాత్రి పద్మావతి అమ్మవారు సింహ వాహనంపై భక్తులను కటాక్షించనున్నారని వివరించారు.

వాహనసేవల్లో తిరుమల పెద్దజీయంగ్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ పూజారి అరెస్ట్

ఢాకా, నవంబర్ 30: బంగ్లాదేశ్‌లో నిరసనల నేపథ్యంలో మరో హిందూ పూజారిని అరెస్టు చేశారు. పూజారి శ్యామ్ దాస్ ప్రభును ఆ దేశ పోలీసులు ఛటోగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇస్కాన్ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఆధ్యాత్మిక నేత చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్ట్ చేసిన కొద్ది రోజులకే ఈ సంఘటన జరిగినట్లు పేర్కొన్నాయి. జైలులో ఉన్న చిన్మయ్ కృష్ణ దాస్‌ను కలిసేందుకు శ్యామ్ దాస్ ప్రభు వెళ్లినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎలాంటి వారెంట్ లేకుండానే ఆయనను అరెస్టు చేసినట్లు ఇస్కాన్ ప్రతినిధి, కోల్‌కతా వైస్ ప్రెసిడెంట్ రాధారామన్ దాస్ తెలిపారు. 'మరో బ్రహ్మచారి శ్రీ శ్యామ్ దాస్ ప్రభును ఈ రోజు ఛటోగ్రామ్ పోలీసులు అరెస్టు చేశారు' అని ఎక్స్‌లో శుక్రవారం పేర్కొన్నారు.

కాగా, బంగ్లాదేశ్‌లోని ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) మాజీ సభ్యుడు, హిందూ పూజారి చిన్మయ్ కృష్ణ దాస్‌ను దేశద్రోహం కేసులో ఆ దేశ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీంతో ఆయన అరెస్ట్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ రాజధాని ఢాకా, ఛటోగ్రామ్‌తో సహా పలు ప్రాంతాల్లోని హిందువులు నిరసనలు చేపట్టారు. చిన్మయ్ కృష్ణ దాస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు చిన్మయ్ కృష్ణ దాస్ బెయిల్‌ను ఛటోగ్రామ్ కోర్టు మంగళవారం నిరాకరించింది. ఈ నేపథ్యంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సైఫుల్ ఇస్లాం మరణించాడు. ఈ లాయర్ హత్యకు సంబంధించి బంగ్లాదేశ్ పోలీసులు ఇప్పటి వరకు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మైనారిటీ హిందూ కమ్యూనిటీకి చెందిన 46 మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కాగా, శుక్రవారం ఛటోగ్రామ్‌లో మూడు హిందూ ఆలయాలను ఒక గుంపు ధ్వంసం చేసింది.

## పుష్ప టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 30:ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా వస్తున్న పాన్ ఇండియన్ మూవీ 'పుష్ప2: ది రూల్' సుకుమార్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుష్ప 2 టికెట్‌ధరలు పెంచుకునేందుకు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల నుంచి బెనిఫిట్ షోలతో పాటు అర్ధరాత్రి 1 షోలకు అనుమతి నిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సింగిల్ థియేటర్‌లలో, మల్టీప్లెక్స్‌ల్లో ఈ బెనిఫిట్ షోలకు టికెట్ ధరలు రూ.800గా ఖరారు చేసింది. మరోవైపు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఎక్స్‌ట్రా షోలకు అనుమతినిచ్చింది.డిసెంబర్ 05 నుంచి 08 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచింది. అలాగే.. డిసెంబర్ 09 నుంచి 16 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతిని ఇచ్చింది. డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.20 మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దాదాపు 18 రోజులు ఈ పెంచిన రేట్లు అమలులో ఉండనున్నట్లు వెల్లడించింది. ఇక తెలంగాణ అడ్వాన్స్‌కు బుకింగ్‌కు సంబంధించి నేడు సాయంత్రం 4.56 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది.

## ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం.. పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ, నవంబర్ 30: దేశ రాజధాని ఢిల్లీ లో వాయు కాలుష్యం కొనసాగుతోంది. దీనికి తోడు ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు ఢిల్లీ వాసులు గజగజ వణికిపోతున్నారు.


వరుసగా మూడోరోజు ఢిల్లీలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవాళ 9.8 డిగ్రీల సెల్సియస్‌తో ఈ సీజన్‌లో రెండో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇక ఢిల్లీలో గాలినాణ్యత చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349గా నమోదైంది. అలిపూర్‌లో 351, బురారీ క్రాసింగ్ వద్ద 351, డీటీయూ వద్ద 377, ఐటీవో ప్రాంతంలో 328గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి. వాయు కాలుష్యంతోపాటు ఢిల్లీని పొగమంచు కమ్మేసింది.

కన్నాట్ ప్రాంతం, ఇండియా గేట్, ఆనంద్ విహార్ ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.







# వ్యాధి చికిత్స కన్న అది సోకకుండా చూసుకోవడమే మిన్న !

**(01 డిసెంబర్ "ప్రపంచ ఏయిడ్స్ దినం" సందర్భంగా)**

1981, 05 జూన్‌న తొలిసారి అమెరికాలో ఐదు హెచ్ఐవి – ఏయిడ్స్ కేసులను గుర్తించడం, 1986లో చెన్నైలో తొలి హెచ్ఐవి – ఏయిడ్స్ కేసు భారత్‌లో బయట పడడంతో ప్రపంచ దృష్టి ప్రాణాంతక హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాధిపై పడింది. "హూమన్ ఇమ్యూనో డెఫిసియెన్సీ వైరస్ (హెచ్ఐవి)" సోకడం వల్ల వచ్చే "అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిసియన్సీ సింద్రోమ్ (ఏఐడిఎస్–ఏయిడ్స్)" అనే ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధి వస్తుంది. దీనినే "అర్జిత వ్యాధినిరోధకత లోపంతో బహువ్యాధి లక్షణం" లేదా ఏయిడ్స్‌గా అర్థం చేసుకోవాలి. నేడు ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉండగా, 40 మిలియన్లకు పైగా మరణించారు. 2023లోనే 1.3 మిలియన్లకు హెచ్ఐవి సోకగా, 6.3 లక్షల మంది హెచ్ఐవి – ఏయిడ్స్ కారణాలతో మరణించారు. 2023లో హెచ్ఐవి సోకిన 86% మందికి తమ ఆరోగ్య పరిస్థితులు తెలుసు అని, 77% మంది "ఆంటీ–రెట్రోవైరల్ థెరపీ" తీసుకుంటున్నారని, 72% మంది వైరల్ లోడ్‌ను తగ్గించుకున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 2030 నాటికి హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాధిని అంతం చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూఎన్ఏఐడిఎస్ సంస్థలు కలిసి కృషి చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకర హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాధి పట్ల ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01 డిసెంబర్ రోజున "ప్రపంచ ఐయిడ్స్ దినం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఏయిడ్స్ దినం–2024 థీమ్‌గా "టేక్ రైట్ పాత్ : మై హెల్త్, మై రైట్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

## హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాప్తికి కారణాలు, వ్యాధి లక్షణాలు:

హెచ్ఐవి అనే వైరస్ సోకడానికి పలు కారణాలు ఉన్నాయి. అసురక్షిత లైంగిక సంబంధాలు పెట్టుకోవడం, స్టెరిలైజ్ చేయని సూది మందులు తీసుకోవడం, రక్త మార్పిడికి ముందు రక్త పరీక్షలు చేయకపోవడం, హెచ్ఐవి సోకిన తల్లి గర్భం దాల్చినా/ప్రసవించినా/రొమ్ము పాలు తాగినా శిశువుకు ఈ వైరస్ సోకుతుంది. లైంగిక సంబంధాలతో సోకడం వల్ల దీనిని "సెక్చువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్(ఎస్‌టిడి)"గా కూడా వర్గీకరిస్తారు. వేశ్యలు, అపరిచితులతో అక్రమ లైంగిక సంబంధాలు ప్రమాదకరం. హెచ్ఐవి వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకడానికి రక్తం, సెమెన్, వజీనల్ ద్రవాలు, తల్లి రొమ్ము పాలు, నోరు, ఆనస్, పెన్నీస్, తెగిన చర్మం, రెక్టా ద్రవాలు వాహకాలుగా పని చేస్తాయి. భారత్‌లో అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల 85.5%, తల్లి నుంచి శిశువుకు 5.9%, స్వలింగ సంపర్కం వల్ల 1.4%, రక్తమార్పిడి వల్ల 1.1%, అపరిశుభ్ర సూదుల వల్ల 1.3% మందికి వైరస్ సోకుతున్నది. హెచ్ఐవి – ఏయిడ్స్ సోకిన వ్యక్తుల్లో బరువు తగ్గడం, జ్వరం, రాత్రులు చెమట పట్టడం, అలసట, కడుపు నొప్పి, దగ్గు, ఆకలి నశించడం, డయేరియా, వాంతులు, నాలుక తెల్లవారడం, ఒళ్లు నొప్పులు, దురద, మింగడం ఇబ్బంది కావడంతో నొప్పి లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి.

## తొలి దశలో గుర్తించడం మంచిది:

హెచ్ఐవి సోకిన వ్యక్తుల రక్తంలో టి–కణాలు నశించడం వల్ల రోగనిరోధకశక్తి తగ్గడంతో రోగాలను తట్టుకునే శక్తి పడిపోతుంది. హెచ్ఐవి సోకిన వ్యక్తులు కొందరు సామాన్య జీవితాలను గడుపుతుంటారు. తొలి దశలో (2,3 మాసాల్లో) గుర్తించి సరైన చికిత్స తీసుకున్నట్లయితే ప్రాణాపాయం తగ్గి అధిక కాలం పాటు ఆరోగ్యంగా బతకవచ్చు లేదా మంచి ఉపశమనం పొందవచ్చు. హెచ్ఐవి సోకిన వారికి సరైన వైద్యం అందకపోయిన యెడల అది ముదిరి ఏయిడ్స్ వ్యాధిగా మారి, ప్రాణాంతకం అవుతుంది. హెచ్ఐవిని గుర్తించడానికి ఆంటిజెన్/ఆంటీ బాడీ పరీక్షలు, ఆంటీ బాడీ పరీక్షలు లేదా న్యూక్లిక్ ఆసిడ్ పరీక్షలు చేస్తారు. నేడు హెచ్ఐవి – ఏయిడ్స్‌కు పూర్తి చికిత్స లేకపోయినా, దాని తీవ్రతను పూర్తిగా తగ్గించడానికి చికిత్సలు ఉన్నాయి.

## హెచ్ఐవి – ఏయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు:

హెచ్చఐవి సోకిన వ్యక్తితో ఆరోగ్యవంతులు అక్రమ లైంగిక సంబంధాలు పెట్టుకోవడం వల్ల ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుంది కాబట్టి ఇలాంటి సంబంధాలకు దూరంగా ఉంటూ లేదా కండోమ్స్ వాడితే వ్యాధి వ్యాప్తి కట్టడి చేయబడుతుంది. శుభ్రం చేయని సిరంజ్‌లను వాడరాదు. డిస్పోజబుల్ సిరంజెస్ వాడడం ఉత్తమం. హెచ్ఐవి సోకిన మహిళలు గర్భం దాల్చడం ప్రమాదకరం కావచ్చు లేదా గర్భిణులు తగు వైద్యుల సూచనలతో ప్రసవించాలి. ఎలాంటి ఔషధాలు లేదా చికిత్సలు లేని హెచ్ఐవి – ఏయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి, ఆచరణాత్మకంగా జీవనశైలిని మార్చుకొనడం మాత్రమే మన చేతిలో ఉన్నది. "రోగానికి చికిత్స కన్న రోగం రాకుండా చూసుకోవడం మిన్న" అని గమనించి మన ఆరోగ్యాలను కాపాడుకుందాం, హెచ్ఐవి – ఏయిడ్స్ కానరాని ప్రపంచాన్ని ఏర్పరచుకుందాం. నిశ్శబ్దాన్ని వీడుదాం – హెచ్ఐవి–ఐయిడ్స్ గూర్చి చర్చిద్దాం.

**– డా။బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# పోలీసింగ్, అంతర్గత భద్రతా వ్యవహారాల్లో అవలంబించాల్సిన వృత్తిపరమైన పద్ధతులు, విధానాలపై చర్చ

న్యూఢిల్లీ, నవంబర్ 30:నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1 వరకు ఒడిశాలో జరిగే డైరెక్టర్ జనరల్స్/ఇన్స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ అఖిల భారత కాన్ఫరెన్స్ 2024లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ పాల్గొంటారు. భువనేశ్వర్లో ఉన్న లోక్ సేవాభవన్‌లోని స్టేట్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు, వామపక్ష తీవ్రవాదం, తీర ప్రాంత భద్రత, నూతన నేర చట్టాలు, మాదకద్రవ్యాలు సహా జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చలు ఉంటాయి. విశిష్ట సేవలు అందించిన వారికి రాష్ట్రపతి పోలీసు పతకం ప్రదానం చేస్తారు.

ఈ సదస్సు జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు వివిధ కార్యకలాపాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ సంబంధిత అంశాల్లో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వేచ్ఛగా చర్చించేందుకు అనువైన వేదికను పోలీసు ఉన్నతాధికారులు, భద్రతా నిర్వాహకులకు అందిస్తుంది. అంతర్గత భద్రతా సమస్యలు, నేరాల అదుపు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వృత్తిపరమైన పద్ధతులు, విధానాలను సూత్రీకరించి, వాటిని పంచుకుంటారు.

డీజీపీ కాన్ఫరెన్స్‌పై ప్రధానమంత్రి ఎల్లప్పుడూ అంత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో జరిగే చర్చలను ప్రధానమంత్రి శ్రద్ధగా వినడంతో పాటు అనధికారికమైన, బహిరంగ చర్చల వాతావరణాన్ని ప్రోత్సహించి కొత్త ఆలోచనలు వెలికితీసే అవకాశం కల్పిస్తారు. ఈ ఏడాది జరిగే ఈ కాన్ఫరెన్స్‌కు కొన్ని ప్రత్యేకతలను జోడించారు. యోగా, బిజినెస్, బ్రేక్ అవుట్ సెషన్లు, థిమాటిక్ డైనింగ్ టేబుళ్లతో ప్రారంభించి రోజంతా సమర్థంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. అలాగే దేశాన్ని ప్రభావితం చేసే క్లిష్టమైన పోలీసింగ్, అంతర్గత భద్రతా వ్యవహారాలపై తమ ఆలోచనలు, సూచనలను ప్రధానమంత్రితో నేరుగా పంచుకునే విలువైన అవకాశం పోలీసు ఉన్నతాధికారులకు ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుంది.

ఏటా జరిగే పోలీసు శాఖ డీజీలు/ఐజీల సదస్సును 2014 నుంచి దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ జరిగేలా ప్రధానమంత్రి ప్రోత్సహిస్తున్నారు. గువాహటి (అస్సాం), రణ్ ఆఫ్ కచ్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), టేకన్పూర్ (గ్వాలియర్, మధ్యప్రదేశ్), ఏకతా విగ్రహం (కేవడియా, గుజరాత్), పుణె (మహారాష్ట్ర), లక్నో (ఉత్తర ప్రదేశ్), న్యూఢిల్లీ, జైపూర్ (రాజస్థాన్) తదితర ప్రాంతాల్లో ఈ కాన్ఫరెన్స్ జరిగింది.

కేంద్ర హోం మంత్రి, పీఎం కార్యదర్శి, జాతీయ భద్రతా సలహాదారు, సహాయ మంత్రి (హోం వ్యవహారాలు), రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు, కేంద్ర పోలీసు వ్యవస్థల ప్రధానాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## హైదరాబాద్‌లోని రాయదుర్గంలో లైంగిక వేధింపుల కారణంగా మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మీడియా కథనాన్ని సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్ఆర్సీ

న్యూఢిల్లీ, నవంబర్ 30:నవంబర్ 27, 2024న తెలంగాణలోని హైదరాబాద్ నగరం రాయదుర్గం ప్రాంతంలో ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిందన్న మీడియా కథనాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. సరోగసీ విధానంలో బిడ్డను కనేందుకు మధ్యవర్తుల ద్వారా బాధితురాలి భర్తతో రూ.10 లక్షలకు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆమెను ఒడిశా నుంచి నగరానికి తీసుకొచ్చారు. ఆమెను తన భర్తకు దూరంగా వేరే ఫ్లాట్‌లో ఉండేలా చేశారు.

మీడియాలో వచ్చిన కథనాన్ని గమనించిన కమిషన్, అదే నిజమని తేలితే బాధిత మహిళ విషయంలో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశంగా దీన్ని తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ అంశంపై నమోదైన ఎఫ్ఐఆర్ స్టేటస్‌తో సహా సమగ్ర నివేదికను రెండు వారాల్లోగా సమర్పించాలని తెలంగాణ ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో సరోగసీ పేరుతో మహిళలు ఎదుర్కొన్న వేధింపులపై ఫిర్యాదులకు సంబంధించిన సమాచారాన్ని సైతం పోలీసు అధికారుల నుంచి కమిషన్ తెలుసుకోనుంది.

# నేడు అనంతపురంలో చంద్రబాబు పర్యటన..

# నేమకల్లులో లబ్దిదారులకు పించన్ లు పంపిణి



అమరావతి, నవంబర్ 30:సీఎం నారా చంద్రబాబు నేడు అనంతపురం జిల్లాకు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా.. నేమకల్లులో ఈరోజు చంద్రబాబు పర్యటించి పెన్షన్లు మంజూరు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

డిసెంబర్ నెలలో పెన్షన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. డిసెంబర్ 1న ఆదివారం కావడంతో, ఆ రోజు పెన్షన్ పంపిణీ చేయడం కష్టమైన విషయంగా మారిపోతుంది. అందువల్ల, ప్రభుత్వం డిసెంబర్ 1న పెన్షన్ అందించలేని పరిస్థితిని నివారించాలనే ఉద్దేశంతో, పెన్షన్ ను ఈ రోజు (నవంబర్ 30) పంపిణీ చేస్తోంది.ప్రభుత్వం 100 శాతం పంపిణీని ఈ రోజు పూర్తిచేయాలని లక్ష్యం గా పెట్టుకుంది.

ఈ పనిలో భాగంగా, సచివాలయ ఉద్యోగులు ఉదయాన్నే నిద్ర లేవడంతో పాటు, పెన్షన్ పంపిణీకి సిద్ధంగా ఉన్నారు. వారికి పని పూర్తి చేయడం కోసం ఏ విధమైన జాప్యం జరగకుండా, ఇవాళే 100% పంపిణీ పూర్తి చేయాల్సి ఉంటుంది. పొరపాటున ఎవరైనా మిస్సైతే, సోమవారమే ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి, అధికారులు, కలెక్టర్లు ఈ పని పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ఏపీ ప్రభుత్వం మొత్తం 26 రకాల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తోంది, వీరిలో వృద్ధులు, వితంతువులు, తలసేమియా బాధితులు, ఒంటరి మహిళలు, అభయహస్తం లబ్దిదారులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చేనేత కార్మికులు వంటి వర్గాలు ఉన్నాయి. వీరందరికీ పెన్షన్ ఇవ్వడానికి సచివాలయ ఉద్యోగులు 29వ తేదీన బ్యాంకుల నుండి మనీ తీసుకున్నారు.

అందువల్ల, ఇవాళ అన్ని జిల్లాల్లో పెన్షన్ పంపిణీ సందడి వాతావరణం కనిపిస్తుంది. ఏపీలో మొత్తం 64,14,174 మంది పెన్షన్ దారులున్నారు. నవంబర్ నెలకి 63,70,509 మంది పెన్షన్ పొందారు, అయితే 43,665 మంది వివిధ కారణాల వల్ల పెన్షన్ పొందలేదు. ఈ 43,665 మందికి డబుల్ పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వారు నవంబర్ 30న రెండు నెలల పెన్షన్లు పొందుతారు. అందువల్ల, సచివాలయ ఉద్యోగులు వారి ఇళ్లకు వచ్చేటప్పుడు, వారికి రెండు పెన్షన్లు ఇవ్వాలని గుర్తు చేయడం అవసరం.

# వయో వృద్ధులకు ఆరోగ్య బీమాపై తాజా సమాచారం

న్యూఢిల్లీ, నవంబర్ 30:ఏడాదికి కుటుంబానికి రూ. 5 లక్షల వరకూ ఉచిత చికిత్స ప్రయోజనాలను అందించే ఆయుష్మాన్ భారత్ ? ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై)ను కేంద్ర ప్రభుత్వం మరింత విస్తరించింది. వారి సామాజిక–ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వయో వృద్ధులందరినీ దీని పరిధిలోకి తెస్తూ అక్టోబర్ 29 న నిర్ణయం తీసుకుంది.

తాజా జాతీయ ప్రత్యేక ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీ (హెచ్ బీపీ)లో.. 27 ప్రత్యేక వైద్యపరమైన అంశాల్లో 1961 విధానాలకు సంబంధించి నగదు రహిత ఆరోగ్య రక్షణ సేవలను ఈ పథకం అందిస్తుంది. సాధారణ ఔషధాలు, సాధారణ శస్త్రచికిత్స, ఎముకలు–కీళ్ల చికిత్స, హృద్రోగ విభాగం, ఆంకాలజీ సహా వివిధ అంశాలు దీని పరిధిలోకి వస్తాయి. వివిధ వయస్సుల వారు దీనిని పొందవచ్చు. వీటిలో హీమో డయాలసిస్/ పెరిటోనియల్ డయాలసిస్, తీవ్రమైన రక్త ప్రసరణ లోపాలు (ఇస్కిమిక్ స్ట్రోక్), రక్తపోటు పెరగడం, మొత్తంగా తుంటి ఎముక మార్పిడి, మొత్తం మోకాలి మార్పిడి, పీటీసీఏ, డయాగ్నొస్టిక్ యాంజియోగ్రామ్, గుండెలో ఒక గదిలో శాశ్వత గతి ప్రేరకాన్ని అమర్చడం (సింగిల్ చాంబర్ పర్మినెంట్ పేస్ మేకర్ ఇంప్లాంటేషన్), రెండు గదుల శాశ్వత గతి ప్రేరకాన్ని అమర్చడం వంటి చికిత్సాపరమైన సేవలు అర్హులైన వయోవృద్ధులకు కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మరింత అనుకూలంగా మలచుకునేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించారు.

దేశవ్యాప్తంగా 70 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న లబ్ధిదారులుండే కుటుంబాల సంఖ్య 4.5 కోట్లు ఉంటుందని అంచనా. అలాంటి 6 కోట్ల మంది వ్యక్తులు ఈ పథకం పరిధిలోకి వస్తారు.

నవంబరు 25 నాటికి 70 సంవత్సరాలు, అంతకన్నా ఎక్కువ వయస్సున్న వృద్ధుల కోసం దాదాపు 14 లక్షల ఆయుష్మాన్ వయో వందన కార్డులను ఈ పథకం ద్వారా సృష్టించారు.

ఈ పథకం కోసం మొత్తం రూ.3,437 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. ఇందులో 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు కేంద్ర వాటా వ్యయంలో రూ.2,165 కోట్లు వచ్చే అవకాశం ఉంది. అక్టోబరు 31 నాటికి మొత్తం 29,870 హాస్పిటళు దీని పరిధిలో ఉండగా.. వాటిలో 13,173 ప్రైవేటు హాస్పిటళ్లు.

లోకసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావ్ జాదవ్ ఈ అంశాలను పేర్కొన్నారు.

# ఆహారంలో పురుగులు.. నాగార్జునలో విద్యార్థినుల ధర్నా

**-దిగి వచ్చిన అధికారులు**
**-హాస్టల్స్ ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్, ఆర్డీవో**
**-నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న వార్డెన్స్ కు వార్నింగ్ ఇచ్చారు**
**-కలుషిత ఆహార ఘనటపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశం**

అమరావతి, నవంబర్ 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వసతిగృహ మెస్‌లో వడ్డిస్తున్న ఆహారంలో తరచూ పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు శుక్రవారం రాత్రి నిరసనకు దిగారు. గత కొన్ని రోజులుగా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారుల తీరును నిరసిస్తూ వసతిగృహం వద్ద రాత్రి ధర్నాకు దిగారు. ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల ఆరోపణలపై విద్యా శాఖ పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. తప్పు తేలితే వెంటనే వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. ఫుడ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

ఈ ఘటనపై అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇవాళ ఉదయం అల్పాహారాన్ని రిజిస్ట్రార్ సింహచలం దగ్గరుండి చేయించారు. వసతి గృహంలో మెస్, కిచెన్‌ను గుంటూరు ఆర్డీవో పరిశీలించారు. వాటర్ ప్లాంట్ పరిశుభ్రంగా లేకపోవడంతో వార్డెన్‌పై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు .కాగా, శుక్రవారం మధ్యాహ్నం ముగ్గురు విద్యార్థినులు భోజనాలు చేస్తున్న సమయంలో సాంబారులో కప్ప రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయం బయట చెబితే భవిష్యత్‌లో ఇబ్బంది పడతారని హెచ్చరించి వారికి టమాట కూర చేసి పెట్టారు. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థినులంతా తమ సొంత డబ్బులతో బయటే భోజనాలు చేశారు. ఇక శుక్రవారం సాయంత్రం, రాత్రి అల్పాహారం, భోజనంలో పురుగులు రావడంతో ఆగ్రహం చెందిన విద్యార్థినులు వసతి గృహం వద్ద రాత్రి ధర్నా చేశారు.

తమ తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని ఫీజులు చెల్లిస్తున్నారని, శుభ్రమైన భోజనం పెట్టలేరా అంటూ మండిపడ్డారు. విద్యార్థినులు బయటకు రాకుండా సెక్యూరిటీ సిబ్బంది గేట్లకు తాళాలు వేశారు. రాత్రి 11గంటల సమయంలో వారంతా ఒక్కసారిగా గేట్లు నెట్టుకుంటూ బయటకు వచ్చారు. వీసీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మద్దతుగా విద్యార్థులు భారీ సంఖ్యలతో తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలంటూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను చుట్టుముట్టారు. ఆందోళన చేస్తున్న విద్యార్థినిల దగ్గరకు వచ్చిన తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను విద్యార్థినిలు చుట్టుముట్టి తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.శనివారం లోపు సమస్యను పరిష్కరిస్తామంటూ రిజిస్ట్రార్ సింహచలం విద్యార్థినిలకు హామీ ఇచ్చారు.విద్యార్థినీలకు అల్పాహారం, భోజనం తయారీ పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మహిళా వసతి గృహం చీఫ్ వార్డెన్,వార్డెన్‌లపై అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అందుకు అనుగుణంగానే నేడు రిజిస్ట్రార్ హాస్టల్స్ మెస్ లను తనిఖీ చేశారు. అయనతో పాటు ఆర్డీవో కూడా తనిఖీలు నిర్వహించి సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చారు..విద్యార్థినుల ఆందోళనపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించారు. విద్యార్థినులు ఫిర్యాదు చేసినా లైట్ తీసుకున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలంటూ ఉదయాన్నే ఆదేశాలు జారీ చేశారు. మెస్ కాంట్రాక్టర్‌పైనా విచారణ చేయాలని ఆర్డర్స్ పాస్ చేశారు లోకేష్.

శ్రీ కొమట్టాజు వెంకట మోహనరావు, పద్మావతీదేవి గార్ల స్మారకంగా
విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
మినీ హాస్యకథల పోటీ నిర్వహిస్తోంది
రూ. 15,000/-ల బహుమతులు
ఒక్కో కథకు రూ.1,000/- చొప్పున 15 కథలకు బహుమతులు
● మూసపోసిన, తిరగరాసిన కథలు కాకుండా అందరినీ ఆకట్టుకొనే నూతన ఒరవడిలో ఉండే కథలకు ప్రాధాన్యత
● డి.టి.పి. అయితే 2 పేజీలు, చేతివ్రాతలో 3 పేజీలు మించరాదు మంచికథలకు నిడివి విషయంలో కాస్త వెసులుబాటు ఉంటుంది
● ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి
● హామీపత్రం మీద మాత్రమే రచయితల పేర్లు, ఫోన్ నంబర్లు ఉండాలి - కథల మీద రచయితల పేర్లు ఉండరాదు - జిరాక్స్ ప్రతులను పంపరాదు
● ఈ-మెయిల్, వాట్సాప్‌లలో కథలు పంపితే స్వీకరించబడవు - పోస్ట్ లేదా కొరియర్ ద్వారానే పంపాలి
ఇతర దేశాల వారికి మాత్రమే ఈ-మెయిల్‌లో కథలు పంపేందుకు అనుమతి
● బహుమతి పొందిన, సాధారణ ప్రచురణకి స్వీకరించిన కథలు 'విశాలాక్షి' పత్రికలో ప్రచురించటం జరుగుతుంది
● బహుమతి ప్రదానం జనవరి / ఫిబ్రవరిలో జరిగే 'విశాలాక్షి వార్షికోత్సవ సభ' లో చిరుసత్కారంతో జరుగుతుంది
కథలు మాకు చేరవలసిన చివరి తేది: 15-12-2024
రచనలు పంపవలసిన చిరునామా
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785
ANVESHI ARTs 9000929886

# డ్రైవర్ తప్పిదంతో ముగిసిన మెకానిక్ జీవితం



అమరావతి, నవంబర్ 30:: నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీ అద్దె బస్సులో ప్రైవేట్ మెకానిక్ చిన్న వెంకట రమణారావు అలియాస్ గణపతి రిపేరు చేసేవాడు. శనివారం బస్సు కింద రిపేరు చేస్తుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు నడిపించాడు.

దీంతో బస్సు కింద రిపేరు చేస్తున్న రమణారావు తలపై బస్సు చక్రాలు పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. భార్యా పిల్లల రోధన చూపరులకు కంటతడి తెప్పిస్తుంది.

# నేమకల్లులో పించన్‌లు పంపిణీ చేసిన చంద్రబాబు



అమరావతి, నవంబర్ 30:ఏపీ వ్యాప్తంగా ఒకరోజు ముందుగా పెన్షన్ల పంపిణీ వేగంగా కొనసాగుతున్నది.. రేపు ఆదివారం కావడంతో ఒకోరోజు ముందే అంటే ఈరోజు ఉదయం నుంచే అన్ని ప్రాంతాల్లో లబ్దిదారులకు పెన్షన్లను గ్రామ పంచాయితీ సిబ్బంది స్థానిక నేతలు పంపిణీ చేశారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా లబ్దిదారులకు పెన్షన్ డబ్బులను పంపిణీ చేశారు. విజయవాడ నుంచి నేటి మధ్యాహ్నం అనంతపురం జిల్లా నేమకల్లు గ్రామానికి చేరుకున్న సీఎం.. ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారురాలి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్‌ను స్వయంగా అందజేశారు. ఇందిరమ్మ కాలనీలో లబ్ధిదారురాలు పాల్తూరు రుద్రమ్మ ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకం కింద నాలుగు వేల రూపాయల వితంతు పెన్షన్‌ను సీఎం అందజేశారు. అనంతరం నేమకల్లు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. ఆపై వారితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కాగా.. బొమ్మనహాల్ మండలం నేమకల్లు చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడు మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి శ్రీ, గుమ్మనూరు జయరాం, ఎమ్మెస్ రాజు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సీఎం పంపిణీ చేశారు. అనంతరం నేమకల్లు ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

# మళ్లీ పులి పంజా.. గాయపడ్డ రైతు

## పరిస్థితి విషమం.. కాగజ్ నగర్ ఆసుపత్రిలో చికిత్స..



ఆదిలాబాద్, నవంబర్ 30: కొమురం భీం జిల్లా సిర్పూర్ టి మండలం దుబ్బగూడ పంట చేనులో ఉన్న రౌతు సురేష్ అనే రైతుపై పెద్దపులి పంజా విసిరింది. శుక్రవారం గన్నారం గ్రామ శివారులోని పత్తి చేనులో మోర్లె లక్ష్మి (22) మహిళపై దాడి చేసి హతమార్చిన పెద్దపులి శనివారం పంట చేనులో పనిచేస్తున్న సురేష్ పై దాడి చేసింది. మెడపై దాడి చేయడంతో రైతు సురేష్ పులిని ప్రతిఘటించే ప్రయత్నంలో అరుపులు కేకలు వేయడంతో పెద్దపులి అక్కడి నుండి వెళ్లిపోయింది.

రక్తస్రావంతో తీవ్రగాయాలతో ఉన్న సురేష్ ను సిర్పూర్ టి ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాగజ్ నగర్ కేంద్రానికి తరలించారు. వైద్యులు సురేష్ కు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్దపులి సంచారంతో కాగజ్ నగర్ డివిజన్ లో భయంతో ప్రజలు వణికిపోతున్నారు. పంట చేనులోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సిర్పూర్ టి, కాగజ్ నగర్ ప్రజలు జన సంచారం లేని ప్రాంతాలకు వెళ్ళవద్దని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# భూపాలపల్లి వైన్స్ షాప్‌లో చోరీ..

వరంగల్, నవంబర్ 30: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజునగర్ వద్ద గల శ్రీ కళ్యాణి వైన్స్ (షాప్ నెంబర్ 6 ) లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు షాపు వక్కనే ఉన్న తలుపు తాళం పగులగొట్టుకుని లోపలికి చొరబడ్డారు.

షాపులో ఉన్న రూ.45వేల నగదు, విలువైన మద్యం, సీసీటీవీ హార్డ్ డిస్క్ ను కూడా ఎత్తుకెళ్లారు. ఉదయం షాప్ తెరిచే సమయానికి షాపు నిర్వాహకులు వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో షాపు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా క్లూస్ టీమ్ తో వివరాలు సేకరిస్తున్నారు.

# డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నవంబర్ 30: స్థానిక కలెక్టర్ కార్యాలయం లోని శనివారం అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు సంబంధిత వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు,మండల, గ్రామ ప్రత్యేక అధికారులతో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల నిర్వహణ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహించే ప్రజాపాలన ,ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అన్ని మండల కార్యాలయాల్లో ప్రభుత్వ లోగో ఏర్పాటు చేసుకోవాలని, అన్ని కార్యాలయాలు పరిశుభ్రత పాటించాలని, విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఆయా శాఖల వారీగా విజయ గాథలను ఇవ్వాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో గ్రామ స్థాయిలో, 10 నుంచి 11వ తేదీల మండల స్థాయిలో, 16-21 వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ ఆటల పోటీలు నిర్వహించాలని, ఆ తదుపరి నెగ్గిన ఆటగాళ్లను రాష్ట్ర స్థాయికి పంపించాలని, ఈ మేరకు పాఠశాలల పీఈటీల సహకారంతో ఈ పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా విద్యాధికారి రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# నేను స్వతహాగా కథకుడిని, సామాన్యుల వాణిని వినిపించేందుకు అవకాశాలిచ్చే స్క్రిప్టులనే ఎంచుకొంటాను: విక్రాంత్ మేసీ

న్యూఢిల్లీ, నవంబర్ 30:ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఫిలిం పర్సనాలిటి ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని గోవాలో నిర్వహించిన 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) ముగింపు కార్యక్రమంలో నటుడు శ్రీ విక్రాంత్ మేసీకి అందజేశారు. భారతీయ చలనచిత్ర రంగానికి శ్రీ విక్రాంత్ మేసీ అందజేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును గోవా ముఖ్యమంత్రి శ్రీ ప్రమోద్ సావంత్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు.. వీరు ఇరువురూ కలిసి ప్రదానం చేశారు.

ఈ సమ్మానాన్ని స్వీకరించే సందర్భంగా శ్రీ విక్రాంత్ మేసీ భావోద్వేగభరితుడయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు తాను సాగించిన ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. "ఇది నాకు నిజంగా ఒక ప్రత్యేకమైన క్షణం. ఇంతటి గౌరవాన్ని అందుకుంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు. జీవితంలో మిట్ట పల్లాలు ఉండనే ఉంటాయి. అయితే, 'ట్వెల్త్ ఫెయిల్' చిత్రంలో నేను పోషించిన పాత్ర మాదిరిగానే మనం ఏదో ఒకచోట ఆగిపోయినప్పటికీ మన ప్రయాణాన్ని మళ్లీ మొదలుపెట్టడానికి ఎల్ల వేళలా సిద్ధంగా ఉండాల"న్నారు.

ఆయన ఇంకా ఇలా మాట్లాడారు.. "నేను స్వతహాగా ఒక కథకుడిని. సామాన్యుల అభిప్రాయాలకు అద్దం పడతాయనుకున్న స్క్రిప్టులనే నేను ఎంపిక చేసుకొంటూ ఉంటాను. మీరు ఏ నేపథ్యం నుంచి వచ్చిన వారయినా గానీ మిమ్మల్ని మీరు ఒప్పుకొంటూ, మీ కథలకు, మీ మూలాలకు అంటిపెట్టుకొని ఉండండి. భారతీయ చలనచిత్ర పరిశ్రమ అందులో భాగం పంచుకోవడానికి అత్యంత ప్రత్యేకం అయినటువంటి పరిశ్రమల్లో ఒక పరిశ్రమ."

ఎవరైనా ఒక మనిషిని ఒక పట్టాన నమ్మడానికి వీలుండనంత ఉన్నత స్థాయిలకు చేరవేయగలిగేది ఆ వ్యక్తి కనే కలలూ, ఆ వ్యక్తి లోనయ్యే సంఘర్షణలూను అనేందుకు శ్రీ విక్రాంత్ మేసీ జీవన గమనమే ఒక విశేష నిదర్శనం. ఆయన తన ముందున్న కాలాన్ని గురించి ఎంతో ఉత్తేజంతో మాట్లాడుతూ, "నా నటన ప్రతిభలో ఇంతవరకు బయటపడని కోణాలు అనేకం ఉన్నాయి. దయచేసి వేచి ఉండి, ఆ కోణాలను పరిశీలించండ"న్నారు.

ఎవరైనా ఒక మనిషిని ఒక పట్టాన నమ్మడానికి వీలుండనంత ఉన్నత స్థాయిలకు చేరవేయగలిగేది ఆ వ్యక్తి కనే కలలూ, ఆ వ్యక్తి లోనయ్యే సంఘర్షణలూను అనేందుకు శ్రీ విక్రాంత్ మేసీ జీవన గమనమే ఒక విశేష నిదర్శనం. ఆయన తన ముందున్న కాలాన్ని గురించి ఎంతో ఉత్తేజంతో మాట్లాడుతూ, "నా నటన ప్రతిభలో ఇంతవరకు బయటపడని కోణాలు అనేకం ఉన్నాయి. దయచేసి వేచి ఉండి, ఆ కోణాలను పరిశీలించండ"న్నారు.

విక్రాంత్ మేసీ ప్రభావవంతమైన చలనచిత్రాల్లో 'దిల్ ధడక్‌నే దో' (2015), 'ఎ డెత్ ఇన్ ద గంజ్' (2016) 'లిప్‌స్టిక్ అండర్ మై బుర్ఖా' (2016), 'హాఫ్ గాల్‌ఫ్రెండ్' (2017), 'డాలీ కిట్టీ ఔర్ వో చమక్‌తే సితారేఁ' (2019) 'గిన్నీ వెడ్స్ సనీ (2020) లతోపాటు సైన్స్ ఫిక్షన్ రత్నం "కార్గో" (2020) వంటివి ఉన్నాయి. ఈ చిత్రాల్లో ప్రతి ఒక్కటీ ఆయన బహుముఖ ప్రతిభను, సినిమా కళ అంటే ఆయనకున్న అంకితభావాన్ని చాటిచెప్పాయి. ఈ కారణంగానే ఇటు ప్రేక్షకులతో పాటు అటు విమర్శకుల ప్రశంసలు కూడా ఆయనకు లభించాయి.

మనసును ఆకట్టుకొనే నమ్మదగ్గ పాత్ర పోషణల ద్వారాను, తెర మీద కనిపించే పాత్రతో ప్రేక్షకులు మమేకమైపోయే దక్షతను కనబరచడం ద్వారాను ఈ నటుడి నేర్పరితనం సినిమా రంగంలో సామాన్యుడికి నిజమైన ప్రతినిధి అంటే ఇతనేనన్న ఖ్యాతిని తెచ్చిపెట్టింది. నటనలో కొత్త పార్శ్వాలను ఆవిష్కరించాలని విక్రాంత్ మేసీ తపించిపోతున్న క్రమంలో, ఆయన పోషించనున్న మరిన్ని పాత్రలు భారతీయ చలన చిత్ర పరిశ్రమలో చెరిగిపోనటువంటి ముద్రను వేస్తాయన్న ఆశను రేకెత్తిస్తున్నాయి.

# తొలిసారి అంగన్వాడీ లేదా శిశు సంరక్షణ కేంద్రాలుగా శిశుసంరక్షణ సేవలను విస్తరించిన మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 30:మహిళల విద్య, నైపుణ్యం, ఉపాధిపై ప్రభుత్వ నిరంతర కార్యక్రమాల ఫలితంగా వారికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. చాలా మంది మహిళలు ఇప్పుడు తమ ఇళ్ల నుంచే, లేదా ఇంటి నుంచే బయటికొచ్చి పనిచేస్తూ లాభదాయకమైన ఉపాధిని పొందుతున్నారు. పెరుగుతున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల కూడా నగరాల్లోకి వలసలు పెరగడానికి కారణమయ్యాయి. గతంలో ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలను ఇంట్లోవారు చూసుకునే అవకాశముండేది. కొన్ని దశాబ్దాలుగా చిన్న కుటుంబాలు వేగంగా పెరిగాయి. దాంతో, ఉద్యోగులైన మహిళల పిల్లలకు రక్షణ, భద్రత అందించే శిశు సంరక్షణ కేంద్రాలు (క్రష్) ఆవశ్యకమయ్యాయి. సరైన సంరక్షణ సేవలు లేకపోవడం మహిళలు బయటకు వెళ్లి పని చేసుకోవడానికి ప్రతిబంధకంగా మారింది. కాబట్టి, వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాలు రెండింటిలోనూ పనిచేసే మహిళల కోసం అత్యున్నతమైన నాణ్యతతో కూడిన శిశు సంరక్షణ కేంద్రాలు అత్యావశ్యకం.

పిల్లలకు సరైన భద్రత, రక్షణ విషయంలో పనిచేసే తల్లులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను పరిష్కరించడం కోసం పాల్నా విభాగం శిశు సంరక్షణ కేంద్రాలను అందిస్తోంది. ఇప్పటి వరకు ఇంటి పనిలో భాగంగా భావించిన శిశు సంరక్షణ సేవలను శిశు రక్షణ కేంద్రాలు అధికారికం చేస్తాయి. 'గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడం' ద్వారా సంరక్షణ చర్యల అధికారికీకరణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లోని 8వ లక్ష్యాన్ని సాధించడంలో దోహదపడుతుంది. గౌరవప్రదమైన పని, ఆర్థిక వృద్ధిని ఆ లక్ష్యం సూచిస్తుంది. ఎలాంటి చెల్లింపు ప్రతిఫలమూ లేకుండా పిల్లల సంరక్షణ బాధ్యతల్లో ఉన్న చాలా మంది తల్లులకు కూడా లాభదాయకమైన ఉపాధిని పొందడానికి ఇది అవకాశం కల్పిస్తుంది.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రపంచంలో అతిపెద్ద శిశుసంరక్షణ సంస్థలు. ఇవి క్షేత్రస్థాయి వరకు పిల్లలకు అవసరమైన సంరక్షణ సౌకర్యాలను అందిస్తాయి. మొదటిసారిగా అంగన్‌వాడీ - శిశు సంరక్షణ కేంద్రాల (ఏడబ్ల్యూసీసీ) ద్వారా పిల్లల సంరక్షణ సేవలను మంత్రిత్వ శాఖ విస్తరించింది. భద్రమైన, సురక్షితమైన వాతావరణంలో రోజంతా శిశు సంరక్షణ సేవలను అందించేలా ఇది అవకాశం కల్పిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో 'మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యాన్ని' పెంచడం అంగన్‌వాడీ- శిశు సంరక్షణ కేంద్రాల లక్ష్యం. పిల్లలకు (6 నెలల నుంచి 6 సంవత్సరాల వయస్సు వరకు) సురక్షితమైన సంరక్షణ సేవలను అందించడం, పోషకాహార సదుపాయం, ఆరోగ్య సేవలు, పిల్లల మేధో వికాసం, పిల్లల ఎదుగుదలనూ - వ్యాధినిరోధకతనూ పర్యవేక్షించడం పాల్నా విభాగం లక్ష్యం. ఉద్యోగ హోదాతో నిమిత్తం లేకుండా తల్లులందరికీ శిశు సంరక్షణ కేంద్ర సదుపాయాన్ని కల్పిస్తారు. వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల నుంచి ఏడబ్ల్యూసీసీల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రతిపాదనలు స్వీకరిస్తారు. పథకం అమలు కోసం తమ వాటాను కూడా వారు అందించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి స్వీకరించిన ప్రతిపాదనల ప్రకారం మొత్తం 10,609 ఏడబ్ల్యూసీసీలు ఆమోదం పొందాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం 10 ఏడబ్ల్యూసీసీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపింది. వాటన్నింటినీ మంత్రిత్వ శాఖ ఆమోదించింది. వీటిని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రారంభించాల్సి ఉంది. లోకసభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్ ఈ సమాచారాన్ని అందించారు.

# అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి.. ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలో అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం తొమ్మిది నెలల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొని జిల్లాకు చేరుకున్న 125 (సివిల్, ఆర్మడ్ రిజర్వు, కమ్యూనికేషన్) కానిస్టేబుల్లకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నందు గల కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాకు చేరుకున్న నూతన సివిల్ ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ తో సమావేశం నిర్వహించి విధులపై దిశ నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో పూర్తి నిబద్ధతతో, అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోలీస్ శాఖ అనుసరిస్తున్న సాంకేతక పరిజ్ఞానం అందిపుచ్చుకోవలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని నిలబడవచ్చున్నారు. తొమ్మిది నెలల శిక్షణలో నేర్చుకున్న నూతన చట్టాలపై నిరంతరం పటనం చేస్తూ అన్ని చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపిన, శాఖ పరమైన చార్యలుంటాయన్నారు.

విజిబుల్ పొలిసింగ్ లో భాగంగా అమలు చేస్తున్న విలేజ్ పోలీసింగ్‌లో భాగంగా తమకు కేటాయించిన గ్రామాలపై పట్టు సాధించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉంటూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది నాకబంది, పికెట్స్, విఐపి బందోబస్త్ డ్యూటీస్, వివిధ బందోబస్త్ డ్యూటీలలో, ప్రిసనర్, క్యాష్ ఎస్కార్డ్స్, లా అండ్ ఆర్డర్ విధులలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు రమేష్, మధుకర్, ఆర్ఎస్ఐ శ్రవణ్ యాదవ్, కమ్యూనికేషన్ సిఐ శ్రీలత, నూతన కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# 70 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న వృద్ధుల కోసం దాదాపు 14 లక్షల ఆయుష్మాన్ వయో వందన కార్డులు

న్యూఢిల్లీ, నవంబర్ 30:ఏడాదికి కుటుంబానికి రూ. 5 లక్షల వరకూ ఉచిత చికిత్స ప్రయోజనాలను అందించే ఆయుష్మాన్ భారత్ ? ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై)ను కేంద్ర ప్రభుత్వం మరింత విస్తరించింది. వారి సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వయో వృద్ధులందరినీ దీని పరిధిలోకి తెస్తూ అక్టోబర్ 29 న నిర్ణయం తీసుకుంది.

తాజా జాతీయ ప్రత్యేక ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీ (హెచ్ బీపీ)లో.. 27 ప్రత్యేక వైద్యపరమైన అంశాల్లో 1961 విధానాలకు సంబంధించి నగదు రహిత ఆరోగ్య రక్షణ సేవలను ఈ పథకం అందిస్తుంది. సాధారణ ఔషధాలు, సాధారణ శస్త్రచికిత్స, ఎముకలు-కీళ్ల చికిత్స, హృద్రోగ విభాగం, ఆంకాలజీ సహా వివిధ అంశాలు దీని పరిధిలోకి వస్తాయి. వివిధ వయస్సుల వారు దీనిని పొందవచ్చు. వీటిలో హీమో డయాలసిస్/ పెరిటోనియల్ డయాలసిస్, తీవ్రమైన రక్త ప్రసరణ లోపాలు (ఇస్కిమిక్ స్ట్రోక్), రక్తపోటు పెరగడం, మొత్తంగా తుంటి ఎముక మార్పిడి, మొత్తం మోకాలి మార్పిడి, పీటీసీఏ, డయాగ్నొస్టిక్ యాంజియోగ్రామ్, గుండెలో ఒక గదిలో శాశ్వత గతి ప్రేరకాన్ని అమర్చడం (సింగిల్ చాంబర్ పర్మినెంట్ పేస్ మేకర్ ఇంప్లాంటేషన్), రెండు గదుల శాశ్వత గతి ప్రేరకాన్ని అమర్చడం వంటి చికిత్సాపరమైన సేవలు అర్హులైన వయోవృద్ధులకు కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఆరోగ్య ప్రయోజన ప్యాకేజీలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మరింత అనుకూలంగా మలచుకునేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించారు.

దేశవ్యాప్తంగా 70 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసున్న లబ్ధిదారులుండే కుటుంబాల సంఖ్య 4.5 కోట్లు ఉంటుందని అంచనా. అలాంటి 6 కోట్ల మంది వ్యక్తులు ఈ పథకం పరిధిలోకి వస్తారు.

నవంబరు 25 నాటికి 70 సంవత్సరాలు, అంతకన్నా ఎక్కువ వయస్సున్న వృద్ధుల కోసం దాదాపు 14 లక్షల ఆయుష్మాన్ వయో వందన కార్డులను ఈ పథకం ద్వారా సృష్టించారు. ఈ పథకం కోసం మొత్తం రూ.3,437 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కేంద్ర వాటా వ్యయంలో రూ.2,165 కోట్లు వచ్చే అవకాశం ఉంది. అక్టోబరు 31 నాటికి మొత్తం 29,870 హాస్పిటళ్లు దీని పరిధిలో ఉండగా.. వాటిలో 13,173 ప్రైవేటు హాస్పిటళు ..లోకసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావ్ జాదవ్ ఈ అంశాలను పేర్కొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు ఆకస్మిక మృతి.. కుటుంబ సభ్యుల ధర్నా



వరంగల్, నవంబర్ 30: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో దారుణ ఘటన జరిగింది. స్థానిక అస్పత్రిలో ఏఎన్ఎమ్ గా విధులు నిర్వహిస్తున్న అప్సర భీ (30) నేడు ఆస్పత్రిలోనే మృతిచెందింది. మృతురాలి తల్లిదండ్రులు మదార్ సుల్తాన్ బీ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి..

తమ కూతురు ఆస్పత్రి ప్రారంభం నుండి ఇక్కడే పనిచేస్తుందని శుక్రవారం రాత్రి 8.30గంటలు విధులకు వచ్చింది. తెల్లవారు జామున ఆస్పత్రి సిబ్బంది ఇద్దరు తమ ఇంటికి వచ్చి కూతురు ఆరోగ్యం బాగాలేదని తమను ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే తమ కూతురు చలనం లేకుండా పడి ఉందన్నారు. ఇక్కడి నుండి తమ కుమార్తెను వరంగల్ అస్పత్రికి తీసుకువెళ్లగా. అప్పటికే మృతిచెందిందని అక్కడి వైద్యులు తెలిపారన్నారు. తమ కూతురు ఒంటిపై గాయాలు వున్నాయని, ఆస్పత్రిలో ఏదో జరగడంతోనే మృతిచెందిందని ఆరోపించారు.

కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా జనరల్ అస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు.

# పోలీసింగ్, అంతర్గత భద్రతా వ్యవహారాల్లో అవలంబించాల్సిన వృత్తిపరమైన పద్ధతులు, విధానాలపై చర్చ

న్యూఢిల్లీ, నవంబర్ 30:నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1 వరకు ఒడిశాలో జరిగే డైరెక్టర్ జనరల్స్/ఇన్స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ అఖిల భారత కాన్ఫరెన్స్ 2024లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ పాల్గొంటారు. భువనేశ్వర్లో ఉన్న లోక్ సేవాభవన్‌లోని స్టేట్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు, వామపక్ష తీవ్రవాదం, తీర ప్రాంత భద్రత, నూతన నేర చట్టాలు, మాదకద్రవ్యాలు సహా జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చలు ఉంటాయి. విశిష్ట సేవలు అందించిన వారికి రాష్ట్రపతి పోలీసు పతకం ప్రదానం చేస్తారు.

ఈ సదస్సు జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు వివిధ కార్యకలాపాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ సంబంధిత అంశాల్లో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వేచ్ఛగా చర్చించేందుకు అనువైన వేదికను పోలీసు ఉన్నతాధికారులు, భద్రతా నిర్వాహకులకు అందిస్తుంది. అంతర్గత భద్రతా సమస్యలు, నేరాల అదుపు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన వృత్తిపరమైన పద్ధతులు, విధానాలను సూత్రీకరించి, వాటిని పంచుకుంటారు.

డీజీపీ కాన్ఫరెన్స్‌పై ప్రధానమంత్రి ఎల్లప్పుడూ అంత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో జరిగే చర్చలను ప్రధానమంత్రి శ్రద్ధగా వినడంతో పాటు అనధికారికమైన, బహిరంగ చర్చల వాతావరణాన్ని ప్రోత్సహించి కొత్త ఆలోచనలు వెలికితీసే అవకాశం కల్పిస్తారు. ఈ ఏడాది జరిగే ఈ కాన్ఫరెన్స్‌కు కొన్ని ప్రత్యేకతలను జోడించారు. యోగా, బిజినెస్, బ్రేక్ అవుట్ సెషన్లు, థిమాటిక్ డైనింగ్ టేబుళ్లతో ప్రారంభించి రోజంతా సమర్థంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. అలాగే దేశాన్ని ప్రభావితం చేసే క్లిష్టమైన పోలీసింగ్, అంతర్గత భద్రతా వ్యవహారాలపై తమ ఆలోచనలు, సూచనలను ప్రధానమంత్రితో నేరుగా పంచుకునే విలువైన అవకాశం పోలీసు ఉన్నతాధికారులకు ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుంది.

ఏటా జరిగే పోలీసు శాఖ డీజీలు/ఐజీల సదస్సును 2014 నుంచి దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలల్లోనూ జరిగేలా ప్రధానమంత్రి ప్రోత్సహిస్తున్నారు. గువాహటి (అస్సాం), రణ్ ఆఫ్ కచ్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), టేకన్పూర్ (గ్వాలియర్, మధ్యప్రదేశ్), ఏకతా విగ్రహం (కేవడియా, గుజరాత్), పుణె (మహారాష్ట్ర), లక్నో (ఉత్తర ప్రదేశ్), న్యూఢిల్లీ, జైపూర్ (రాజస్థాన్) తదితర ప్రాంతాల్లో ఈ కాన్ఫరెన్స్ జరిగింది.

కేంద్ర హోం మంత్రి, పీఎం కార్యదర్శి, జాతీయ భద్రతా సలహాదారు, సహాయ మంత్రి (హోం వ్యవహారాలు), రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలు, కేంద్ర పోలీసు వ్యవస్థల ప్రధానాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# ఒకే తరగతిలో తల్లీ, కుమారుడు... పెద్దపల్లి ఐటీఐలో విద్యార్థులు

**-కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో చదువుకు దూరం**
**-ఆ మమకారం చంపుకోలేక మళ్లీ క్లాసులకు**
**-సహకరించిన అత్తింటి వారు, కుటుంబ సభ్యులు**
**-ఉన్నత చదువులకు ఆలంబనగా అంబేద్కర్ వర్సిటీ**
**-కొడుకుతో పాటు చదువుకునే అవకాశం అదృష్టం**
**-ఈ చాన్స్ అందరికీ రాదంటున్న స్వర్ణలత**


కరీంనగర్, నవంబర్ 30: పెళ్లి, కుటుంబ సమస్యలు ఇలా వివిధ కారణాలతో చదువును మధ్యలోనే వదిలేసినవారు చాలా మంది ఉన్నారు. అయితే.. చదుకోవాలనే ఆసక్తి., చదువు మీద ప్రేమ చాలా మందిలో అలాగే ఉండిపోతుంది. కొంత మంది పెళ్లి అనంతరం, మలి వయసులోనూ పరీక్షలు రాసేవారి గురించి అప్పుడప్పుడు వింటూనే ఉంటాం. కానీ, తల్లి కొడుకులు ఒకే తరగతి గదిలో కలిసి చదువుకునే సంఘటనలు చోటు చేసుకోవడం చాలా అరుదు.. అలాంటి అరుదైన సన్నివేశం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో కనిపించింది. ఓ తల్లి కొడుకులు కలిసి ఒకే కోర్సులో చేరి ఒకే తరగతి గదిలో కలిసి కూర్చుని పాఠాలు వినే అత్యంత అరుదైన సంఘటన చోటు చేసుకుంది. ఆ తల్లి కొడుకులు కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సు చేస్తున్నారు. ఈ అరుదైన ముచ్చట తెలుసుకోవాలంటే కమాన్‌పూర్ వెళ్లాల్సిందే.. అందాక ఎందుకు అనుకుంటే మ్యాటర్‌లోకి వెళ్లి చదివేద్దాం పదండి..

కమాన్ పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన జక్కుల అలియాస్ గాండ్ల స్వర్ణలత (38) .. తన కుమారుడు రోషన్ (18)తో కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులో చేరారు. ఇది ఒక సంవత్సరం కోర్సు కాగా, వీరు 2024 - 25 విద్యా సంవత్సరానికి ఇందులో చేరారు. ఇక.. గాండ్ల స్వర్ణలత వివాహనికి ముందు ఇంటర్మీడియేట్ పూర్తి చేసింది. వివాహం అనంతరం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరం 2005 పూర్తి చేశారు. కొన్ని కారణాలతో ఐదు సంవత్సరాల కాల వరిమితి అనంతరం డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు సంబందించిన విద్యను 2010-11, 2011-12 లలో పూర్తి చేశారు.

ఆనంతరం 2014లో పీజీ (ఎమ్మెస్సీ మ్యాథ్స్) చేశారు. మళ్లీ చదువుకు బ్రేక్ వడింది. ఈ కాలవ్యవధిలో స్వశక్తి సంఘంలో సీఏగా బాధ్యతలు నిర్వహించారు. తన కుమారుడు పెద్దపల్లి ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోగా.. ఆమె కూడా చదువుపై ఉన్న మక్కువతో అదే కోర్సుకు దరఖాస్తు చేసింది. ఆ కోర్సులో కొడుకుతో పాటు తల్లి కూడా చేరింది. ఈ ఒక సంవత్సరం కోర్సులో విద్యనభ్యసించేందుకు పెద్దపల్లి ఐటీఐ కేంద్రానికి ప్రతి నిత్యం ఆ తల్లి కొడుకులు కలిసి వెళ్ళివస్తున్నారు.

తల్లి కొడుకులు కలిసి విద్యాభ్యాసానికి వెళ్లిరావడం మొదట్లో ఇటు గ్రామస్తులను అటు అదే కోర్సులోని తోటి విద్యార్థులనూ వింతగా అనిపించింది.. కాస్త విస్మయపరిచింది. తన పిల్లల వయస్సున్న వారితో కలిసి కోర్స్ చేయడం గర్వాంగా ఉందని ఆమె చెబుతున్నారు. తల్లితో కలిసి కోర్సు చేయడం చాలా అరుదుగా కొడుకులకు లభించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా బావిస్తున్నానని కుమారుడు రోషన్ చెబుతున్నారు. ప్రతి నిత్యం తమ కోర్సులో చెప్పిన అభ్యాసం గురించి తల్లి కొడుకులు చర్చించుకుంటారని వారిద్దరూ చెబుతున్నారు. ఒకే కోర్సును తాము ఇద్దరం కలిసి చదువుకోవడం మాటల్లో చెప్పలేని ఓ మధురనుభూతిని కలిగించిందని ఆ తల్లి కొడుకులు చెబుతున్నారు.

నేను మా ఇంట్లో మూడో సంతానంగా జన్మించాను. నాకు ముందు ఇద్దరు సోదరులున్నారు. ఆడపిల్లనేనే చిన్న చూపు చూడకుండా మా తల్లిదండ్రులు జక్కుల చంద్రమ్మ - మల్లయ్య మంచిగా చదివించి వివాహం చేశారు. అనంతరం భర్త లక్ష్మణ్ కూలి పని చేస్తూ కూడా చదువుకునేందుకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

# గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ

## –లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

కొజికోడ్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధాని నరేంద్ర మోడీ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. "లోక్ సభలో మేము రాజకీయ సిద్ధాంతాలపై పోరాడుతున్నాము. మేమేమో అనుభూతులు, భావోద్వేగాలు, ప్రేమవంటి వాటి గురించి మాట్లాడుతున్నాం. కానీ వారేమో విద్వేషం, క్రోధం, విభజన, హింస గురించి మాట్లాడుతున్నారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోంది. ఇతర భారతీయలకు భిన్నంగా అదానీని మాత్రం ప్రత్యేకంగా చూస్తామని ప్రధాని మోడీ అంటున్నారు" అని రాహుల్ గాంధీ వాయనాడ్ లో జరిగిన బహిరంగ సభలో తెలిపారు."అమెరికా అదానీని ఆరోపిని చేసినప్పటికీ, దోషిగా చేసినప్పటికీ అదేమంత విషయం కాదని మోడీ అంటున్నారు. మన దేశంలో మాత్రం అతడిని దోషిని చేయమంటున్నారు" అని రాహుల్ గాంధీ అన్నారు. లంచం కేసులో అమెరికా ప్రాసిక్యూటర్లు అదానీని దోషిగా తేల్చారు. ఆయనపై కేంద్రం కఠిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.రాహుల్ గాంధీ బిజెపి మీద దాడి చేస్తూ వారి వద్ద డబ్బు, ఇంటెలిజెన్స్ సంస్థలు, సిబిఐ, ఈడి, ఐటి వంటివన్నీ ఉన్నాయి. కానీ మా దగ్గర కేవలం ప్రజల భావోద్వేగాలున్నాయి. మేము బిజెపి సిద్ధాంతాలను ఓడిస్తామన్న విశ్వాసం మాకుంది" అన్నారు. "ప్రియాంక గాంధీ మీ పార్లమెంటు ప్రతినిధి. మీరామెను ఎన్నుకున్నారు. ప్రజల్లో ఉన్న అభిమానం ప్రియాంక గాంధీని ఎంపీని చేసిందని నేను భావిస్తున్నాను" అంటూ రాహుల్ గాంధీ తెలిపారు.

# మార్కెట్లోకి గ్రావ్టోన్ క్వాంటా ఎలక్ట్రిక్ బైక్.. రూ.1.2 లక్షల నుంచి లభ్యం



హైదరాబాద్, నవంబర్ 30: ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్స్ తయారీ సంస్థ గ్రావ్టోన్ మోటార్.. భారత్ మార్కెట్లోకి క్వాంటా ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ ఆవిష్కరించింది. లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తున్న తొలి మోటారు సైకిల్ ఇది. గ్రావ్టోన్ క్వాంటా మోటారు సైకిల్ రూ. 1.2 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఓలా ఎస్1, ఏథేర్ 450ఎక్స్ వంటి ఈవీ మోటారు సైకిళ్లతో గ్రావ్టోన్ క్వాంటా ఈవీ మోటార్ సైకిల్ పోటీ పడుతుంది. ఈ మోటారు సైకిల్ లో 2.78 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఏకో మోడ్ లో 125 కి.మీ, స్పోర్ట్స్ మోడ్ లో 85 కి.మీ, పవర్ మోడ్ లో 100 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ బ్యాటరీ ప్యాక్ 90 నిమిషాల్లో పూర్తిగా చార్జింగ్ అవుతుంది. గరిష్టంగా గంటకు 75 కి.మీ వేగంతో దూసుకెళ్తుంది.

# క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యం : కలెక్టర్ రంజిత్

కర్నూలు, నవంబర్ 30: క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమని, జిల్లాలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం కర్నూలు వైద్య కళాశాలలో నిర్వహించిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ తొలి సదస్సులో ప్రివెంటివ్ ఆంకాలజీ, ప్యాలియేటివ్ కేర్ అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం చాలా గర్వకారణం అన్నారు. రాష్ట్ర క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ తొలి వార్షిక సదస్సు క్యాన్సర్ నివారణ, చికిత్సా విధానాలు, నూతన ఆవిష్కరణలను తెలియజేసే గొప్ప వేదికగా నిలిచిందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.


క్యాన్సర్ పై రీసెర్చ్, నివారణ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, కర్నూలు వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి నివారణ చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు.

ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా సర్జరీలు, కీమోథెరపీ వైద్య సేవలను అందించేందుకు సుమారు రూ.30 కోట్ల వ్యయంతో కూడుకున్న వైద్య పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకొని వస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కెనడా దేశ టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు డా.గిల్లియన్ ఫైల్స్, డా.మేరియాన్ మోర్గాన్డా లు, డాక్టర్ గాయత్రి పలాట్ , వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఆదిలాబాద్, నవంబర్ 30: పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని 29 గ్రామపంచాయతీలోని 11 మంది లబ్ధిదారులకు రూ. 1,10 1,276.00 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ముందుగా మండలంలోని మహమ్మదాబాద్, చింతగూడ, కిష్టాపూర్, జన్నారం, మురిమడుగు, కలమడుగు గ్రామాలలో డీసీఎంఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాల సన్నవడ్లను కొనుగోలు చేస్తూ రూ.500ల బోనస్ ఇస్తుందన్నారు. అన్ని విధాల రైతులను ఆదుకుంటుందని ఆయన చెప్పారు. రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో తమ ప్రభుత్వమే రైతులకు చేసిందని ఆయన స్పష్టం చేశారు. వడ్లను కొనుగోలు కేంద్రంలోని అమ్మి రైతులు లబ్ధిపొందాలని ఆయన సూచించారు.

రైతులను మోసం చేస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీఓ ఠాగూర్ శశికళ, ఎంపీ జలంధర్, ఐకెపి ఎపిఎం బుచ్చన్న, చింతగూడ, పొనకల్ సింగిల్ విండో చైర్మన్లు నాసాని రాజన్న, అల్లం రవి, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# సవతి కూతురుపై అత్యాచారం.. ఒక వ్యక్తికి 141 ఏళ్లు జైలు శిక్ష

తిరువనంతపురం, నవంబర్ 30: ఒక వ్యక్తి సవతి కూతురుపై పలు ఏళ్లుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు నిందితుడికి 141 ఏళ్లు జైలు శిక్ష విధించింది. (ఓజీని ఉవబిబ 141 జవజీతీ ఖతీతిబనీని నావనిబివనిఇవ) కేరళలోని మలప్పురం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తమిళనాడుకు చెందిన కుటుంబం పని కోసం కేరళకు వలస వచ్చింది. అయితే 2017 నుంచి 2020 వరకు సవతి తండ్రి సవతి కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు.

ఆమె తల్లి ఇంట్లో లేనప్పుడు ఆ బాలికపై అత్యాచారం చేసేవాడు.

కాగా, బాధిత బాలిక ఈ విషయాన్ని తన స్నేహితురాలికి చెప్పింది. ఆమె సూచనతో సవతి తండ్రి అకృత్యాలను తల్లికి వివరించింది. దీంతో 2021లో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సవతి తండ్రిని అరెస్ట్ చేశారు. పోక్సో చట్టంతోపాటు, ఐపీఎస్, జువెనైల్ జస్టిస్ చట్టాల్లోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. 2022లో బెయిల్‌పై విడుదలైన ఆ వ్యక్తి సవతి కుమార్తెపై మళ్లీ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో అతడిపై మరో కేసు నమోదైంది.

మరోవైపు మంజేరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఈ రెండు కేసులపై విచారణ జరిపింది. నవంబర్ 29న జడ్జి అష్రఫ్ ఏఎం తీర్పు ఇచ్చారు. సవతి కుమార్తెపై ఏళ్లుగా అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని దోషిగా నిర్ధారించారు. పోక్సో, జువెనైల్ జస్టిస్ చట్టాలతోపాటు ఐపీసీలోని పలు సెక్షన్ల ప్రకారం రెండు కేసుల్లో మొత్తం 141 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు.

కాగా, అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని కోర్టు పేర్కొంది. దీంతో ఆ వ్యక్తి గరిష్ఠంగా 40 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలాగే దోషికి రూ. 7.85 లక్షల జరిమానా కూడా కోర్టు విధించింది. బాధితురాలికి ఈ నష్టపరిహారం అందించాలని ఆదేశించింది.

# ఎంపీ హోదాలో.. తొలిసారి వయనాడ్‌కు ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్ 30:కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే కేరళలోని వయనాడ్ స్థానానికి జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. రెండు రోజుల క్రితం ఎంపీగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ హోదాలో ప్రియాంక తొలిసారి తన నియోజకవర్గం వయనాడ్‌కు వెళ్లారు. సోదరుడు రాహుల్ గాంధీ తో కలిసి శనివారం ఉదయం కేరళ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అక్కడ ఘన స్వాగతం లభించింది. ఇవాళ వయనాడ్‌లో నిర్వహించిన పబ్లిక్ మీటింగ్‌లో ప్రియాంక పాల్గొని ప్రసంగించనున్నారు.

కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష రాజీకాయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. గత శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు. ఈ క్రమంలోనే గురువారం లోక్‌సభలో ఎంపీగా ప్రమాణం చేశారు. కేరళ సంప్రదాయ కసావు చీర కట్టుతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన ప్రయాంక.. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు.

# తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అంటే నిప్పుతో చెలగాటమే : దాసోజు శ్రవణ్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 30:ఉద్యమ ద్రోహి రేవంత్ రెడ్డి తెలంగాణ అస్థిత్వాన్ని ధ్వంసం చేసే కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే విధంగా, ఉద్యమ ప్రతిరూపంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం మార్పు అంటే నిప్పుతో చెలగాటమే అని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ తల్లి అంటే ఓ దేవత, భూ మాత. తెలంగాణ తల్లికి కిరీటం ఉండద్దట.. దేవతకు కిరీటం ఉండకూడదా.. అని సీఎం రేవంత్ రెడ్డిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ప్రతి పల్లెలో, గల్లీల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయి. ఎన్నింటిని విధ్వంసం చేస్తావ్? రేవంత్ రెడ్డి లెక్క ప్రకారం.. ఒక వేళ కిరీటం రాచరికానికి సింబల్ అయితే.. హిందూ సంప్రదాయమైన దేవుళ్లకు కిరీటం ఉంది. అందరి దేవుళ్లకు కిరీటం తీసేస్తావా రేవంత్ రెడ్డి. తెలంగాణ తల్లికి దేవత స్వరూపం ఉండాలని కిరీటం పెడితే దాన్ని విధ్వంసం చేయాలని ప్రయత్నం చేస్తున్నవ్. కిరీటం అనేది సామాజిక స్ఫూర్తికి వ్యతిరేకం అయితే.. రేవంత్ రెడ్డి కూడా రెడ్డి అని పెట్టుకోవడం సామాజిక స్ఫూర్తికి వ్యతిరేకం. ఎందుకంటే ఆయనే అన్నడు.. రెడ్డి అంటే వేం రాజులం. వేం భూస్వాములం. వేం రాచరికం కోసమే పుట్టినం. పరిపాలించడం కోసమే పుట్టినం. వేమంతా భూస్వాములుగా ఉండాలని పలు సందర్భాల్లో రేవంత్ రెడ్డి మాట్లాడారు. సామాజిక, ఉద్యమ స్ఫూర్తి లేకుండా అధికారం అడ్డం పెట్టుకుని చిల్లర మల్లరగా చేస్తున్న ప్రయత్నం దుర్మార్గం. పిచ్చోడి చేతిలో రాయిలా మారింది పరిపాలన. అధికారం ఉందని విర్రవీగుతూ ఉద్యమ చిహ్నాలను విధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. కేసీఆర్‌పై కోపంతో.. తెలంగాణపై కోపంతో సైకోలా వ్యవహరిస్తున్నాడు రేవంత్ రెడ్డి అని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు.

తెలంగాణ అస్తిత్వంపై, ఆత్మపై రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నాడు. కేసీఆర్‌పై అక్కసుతో మొత్తం తెలంగాణ అస్తిత్వాన్ని సర్వనాశనం చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఒక పెద్ద పాపం చేస్తుండు రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నా అనే సోయి లేకుండా విచ్చలవిడిగా అకృత్యాలకు పాల్పడుతున్నాడు. నీ నిర్ణయం తప్పని ఒప్పుకొని లగచర్లలో ఫార్మాని రద్దు చేసినవ్.. మరి రైతులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఎందుకు రద్దు చేయలేదు.. ఇప్పటికీ జైల్లోనే ఉన్న రైతులను ఎందుకు విముక్తి చేయట్లేదు.. వెంటనే రైతులపై, పట్నం నరేందర్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# సినిమా అవకాశాలు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా: రాజేంద్రప్రసాద్

హైదరాబాద్, నవంబర్ 30: తన కెరీర్ ఆరంభంలో అవకాశాలు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కూతురు చనిపోయిన అనంతరం చాలారోజులుగా సినిమాలకు మీడియాకు దూరంగా ఉంటున్న నటకిరిటి తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎన్నో కష్టాలను అనుభవించానని తెలిపారు. చేతిలో డబ్బుల్లేక దాదాపు మూడు నెలలు అన్నం కూడా తినలేదని తెలిపారు.

తాను ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే సినిమాల్లోకి వెళదాం అనుకున్నాను. అయితే మా నాన్న స్కూల్ టీచర్. చాలా స్ట్రిక్ట్ గా ఉండేవాడు. నేను సినిమాల్లోకి వెళతాను ఫిలిం కాలేజ్‌లో జాయిన్ అవుతాను అని ఆయనకు చెప్పినప్పుడు ఆయన నా మీద ఇంట్రెస్ట్ చూపించకపోగా.. అసహనం వ్యక్తం చేశాడు. అయిన పట్టుబట్టాను. ఇక నేను వెళ్లేముందు మా నాన్న ఒక్కటే చెప్పాడు. మా ఇష్టానికి నిన్ను చదివించాం. మేము చదివించినందుకు ఇంజినీరింగ్ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యి అది పక్కన పెట్టి. ఇప్పుడు నీ ఇష్టానికి వెళ్తున్నావు. అయితే అక్కడ సక్సెస్ ఫెయిల్యూర్ అనేది నీకు సంబంధించినది. సినిమాల్లో నువ్వు ఫెయిల్ అయితే ఇంటికి రావద్దని అన్నారు. ఆ తర్వాత తాను మద్రాస్ వచ్చి ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో చేరానని గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు.

అయితే ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో గోల్డ్ మెడల్ వచ్చినా కూడా తనకు సినిమా అవకాశాలు మాత్రం రాలేదని చెప్పారు. దీంతో ఇంటికి తిరిగి వెళ్తే? రావద్దన్నాను కదా ఎందుకు వచ్చావని నాన్న అన్నారు? ఆ మాటతో వెంటనే మద్రాస్‌కు వచ్చానని తెలిపారు. మద్రాస్‌కి అయితే వచ్చాను కానీ ఏం చేయాలో తెలిదు. జేబులో చిల్లిగవ్వ లేదు. నెల రోజుల వరకు తిండి లేదు. ఇక సుసైడ్ చేసుకొని చనిపోదాం అనుకున్నాను. నా దగ్గర ఉన్న చిల్లరతో మందు డబ్బా కూడా కొన్నాను. అయితే నన్ను మద్రాస్‌లో ఆదుకున్న అందరిని కలిసి రావాలని చిన్న కోరిక పుట్టింది. దీంతో వారిని కలవడానికి వెళ్లాను. ఇందులో సీనియర్ ఎన్టీఆర్ కూడా ఉన్నారు. ఆయన నన్ను చూసి ఏమైంది అన్నాడు. ఏం లేదు సార్ అన్నాను. తర్వాత తిరిగి తిరిగి చివరికి పుండరీకాక్షయ్య ఆఫీసుకు వచ్చాను.

ఆయన ఆఫీస్‌కు వచ్చేటప్పటికి లోపల ఏదో గొడవ జరుగుతుంది. మెలుకొలుపు అనే సినిమాకు సంబంధించి గొడవ జరుగుతుంది. చచ్చిపోయేముందు ఇదేం గోలరా బాబు అనుకొని గంట కుర్చున్నాను. కళ్లు తిరిగి పడిపోయేలా ఉన్నాను. ఆ టైంలో పుండరీకాక్షయ్య బయటకు వచ్చారు. బయటకు వచ్చిన ఆయన నన్ను చూసి ప్రసాద్ ఇక్కడ ఏం చేస్తున్నావు అంటూ ఏమీ చెప్పకుండా డబ్బింగ్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. ఒక సీన్‌కు నాతో డబ్బింగ్ చెప్పించారు. అది ఆయనకు బాగా నచ్చింది. రెండో సీన్‌కు డబ్బింగ్ చెప్పమనగానే.. భోజనం చేసి మూడు నెలలు అయింది భోజనం పెడితే చెబుతాను అన్న. దాంతో ఆయన కోప్పడి మంచి భోజనం పెట్టించారు.

# ఆసియా అభివృద్ధి బ్యాంకు వద్ద కేంద్రం 98 మిలియన్ల రుణం..

న్యూఢిల్లీ, నవంబర్ 30: ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) వద్ద కేంద్ర ప్రభుత్వం 98 మిలియన్ డాలర్ల రుణం తీసుకున్నది. హార్టికల్చర్ పంటల దిగుబడి పెంపు కోసం కేంద్రం ఈ రుణం తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ శుక్రవారం ప్రకటించింది. హార్టికల్చర్ పంటల దిగుబడి పెంపునకు.. ఆయా పంటలకు చీడ పీడల నివారణకు ఈ రుణం ఉపయోగిస్తామని ఆర్థికశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 'బిల్డింగ్ ఇండియా'స్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్' అనే అంశంపై జరిగిన ఒప్పందం మీద ఆర్థిక శాఖ ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి జుహీ ముఖర్జీ, ఏడీబీ ఇండియా ప్రతినిధి కైవై యేయో సంతకాలు చేశారు. ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత జూహీ ముఖర్జీ స్పందిస్తూ.. 'రైతులకు ఆరోగ్యకరమైన పంటల దిగుబడి పెంచడానికి ఏడీబీ నిధులను వినియోగిస్తాం' అని పేర్కొన్నారు. భారత్ ఆత్మ నిర్భర్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్ (సీపీపీ) కింద ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఏడీబీ ప్రతినిధి కైవే యేయో తెలిపారు.

# భారత్‌లో భారీగా పాముకాటు మరణాలు.. రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు..!



న్యూఢిల్లీ, నవంబర్ 30:ప్రపంచవ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్, గుండెజబ్బులు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అయితే, మరికొన్ని సమస్యలతోనే ఏటా మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో ఒకటి పాముకాటు మరణాలు. ప్రపంచవ్యాప్తంగా పాముకాటు కారణంగా సంభవిస్తున్న మరణాల రేటులో భారత్‌లో అత్యధికంగా ఉన్నది. ఓ అంచనా ప్రకారం ఏటా 45,900 నుంచి 58వేల మంది వరకు పాముకాటు కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు. పాముకాటు కేసులు, మరణాలను 'నోటిఫై చేయదగిన వ్యాధి'గా మార్చాలని సూచించారు. దాంతో దాంతో ఒకపై పాముకాటు మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి రానున్నది.

2030 నాటికి పాముకాటు మరణాలను సగానికి తగ్గించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2030 నాటికి పాముకాటు మరణాల నివారణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఔంఖూఇ)ను ప్రారంభించింది. పాముకాటుతో మరణంతో పాటు వైకల్యానికి దారి తీస్తుందని కార్యదర్శి పేర్కొన్నారు. రైతులు, గిరిజనులు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారని తెలిపారు. పాముకాటు కేసులు, మరణాలను నిఘాను పెంచడమే ప్రణాళిక ప్రధాన లక్ష్యమని చెప్పారు. పాముకాటు వ్యాధులు, మరణాలను ప్రజారోగ్య చట్టం.. ఇతర వర్తించే చట్టం ప్రకారం.. 'నోటిఫై చేయదగిన వ్యాధులు'గా మార్చాలని అభ్యర్థించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సౌకర్యాలు (మెడికల్ కాలేజీలతో సహా) పాముకాటు కేసులు, మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.